# సమరహా సమరం

(ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, జూలై, 1997)

---

“సరింగ పట్టుకోహే .. రేసీకటి మొగుండావా.” సరసంగా విసుక్కున్నాడు భార్యను రాజయ్య

“సాల్లే వూర్కో సంబడం ....నే గట్టిగనే పట్టుకున్నా. ఆపంప సలు వస్తేత్తందో లేదో .... నువ్వూర్కే తుపుక్ తుపుక్ మంటూ ఆడిత్తంటే గాలేటెక్కద్దీ” నిష్ఠూరాలాడింది జయమ్మ.

“నీ తెలివి తెల్లారిందిలేగానీ....ఇక సాల్లే” అంటూ సైకిల్ పంపును గోడవారగా పెట్టేడు రాజయ్య.

తోపుడు బండిని పాతగుడ్డతో తుడవసాగింది జయమ్మ.

బాగా పండిపోయివున్న అరటిపండ్ల గెలల్ని ఒద్దికగా బండి మీద పెట్టుకున్నాడు రాజయ్య. చాలా పండ్లు గెలనుండి వూడిపోయినై. వాటన్నింటిని పొందిగ్గా బండిమీద సర్దిపెట్టుకున్నాడు.

“ఈగో ఇవి మరీపండినై మావా. ఈటిన్నిగూడ ఏసుకెల్తావా” గోడవారగా వున్న పండ్లను చూపుతూ అడిగింది జయమ్మ.

“అన్నీ తీసుకెళ్ళి అయినకాడికి అమ్ముకొచ్చుకుంటానే. ఈ రెండుగంటల్లో ఎన్నమ్ముడు పోతయ్యో ఏందో ...మల్లీ రేపు సాయంత్రానిక్కాదా బయటకెళ్లేది” దీనంగా అన్నాడు రాజయ్య

మరీ తొక్కకూడా వూడిపోయిన నాలుగయిదు పండ్లు మినహా మిగిలిన వాటన్నింటిని బండిమీద పేర్చింది జయమ్మ.

కండువా తలకు చుట్టుకుని చుట్ట నోట్లో పెట్టుకున్నాడు రాజయ్య.

మెల్ల మెల్లగా జనం రోడ్లమీదకు రావడం మొదలుపెట్టి

టంతో, చుట్టపొగ గుప్పు గుప్పున వదుల్తూ బండిని తోసుకుంటూ రోడ్డుమీదకు చేరేడు రాజయ్య.

"అరటిపళ్లు, అరటిపళ్లు" అరుచుకుంటూ అడుగులు వేయ సాగేడు రాజయ్య.

"మావా! తొందరగా వచ్చేయ్" పెద్దగా చెప్పింది జయమ్మ.

అట్లాగే అన్నట్టు తలాడించి ముందుకు సాగేడు రాజయ్య.

"అంతగా తోచకపోతే అనంతయ్య కళ్ళీకొట్టు దగ్గరకు వెళ్లి కాసేపు కాలక్షేపం చేసుకురండి . బండీ వేసుకుని బజారుకు వెళ్తే ఏం గొడవలు జరుగుతయ్యో ఏమో ..." అనునయంగా అన్నది ఇందిర.

"గొడవలేం జరగవులే నీదంతా భయం.. పదండి బావ గారూ, అలా సెంటర్‌దాకా వెళ్ళొద్దాం " భార్యను విసుక్కుంటూనే బావమరిదిని బయల్దేరదీశాడు భగవంతరావు

"ఇక మీరు బయల్దేరదలుచుకున్న తర్వాత ఇంకొకరి మాట వింటారా వెళ్తే వెళ్ళండిగానీ కాస్త త్వరగా బయల్దేరి ఇంటికి చేరండి. పోలీసుల చేతుల్లో దెబ్బలు తినక" హెచ్చరింపుగా అన్నది ఇందిర.

"నేనున్నానుగా అక్కా. బావగార్ని క్షేమంగా ఇంటికి చేర్చే పూచీ నాది నువ్వు కంగారుపడక. కర్ఫ్యూ కబుర్లన్నీ వివరంగా వినిపిస్తాను వచ్చాక. అందాకా వంటపని చూసుకో." అని స్కూటర్ బయటకు తీశాడు చిదంబరం

"అన్నట్టు మర్చిపోయాను స్కూటర్లో పెట్రోలున్నట్టు లేదు. బంకుదగ్గర బాకులు తీసివుంటాయి, బండి మధ్యలో ఆగితే అవస్థ పడతాం. నడిచే వెళ్దాంలే చిదంబరం" అన్నాడు భగవంతరావు

స్కూటర్ స్టాండువేసి బయటకునడిచారు బావ,బావమరుదులు.

నాలుగు రోజులుగా నగరంలో కర్ఫ్యూ విధించారు. ఆఫీసు ల్లేవ్. స్కూళ్లు లేవ్. వీధులన్నీ నిర్మానుష్యంగా వుంటున్నాయ్. కూడలి స్థలాల్లో పోలీసులు వుంటున్నారు. రెండు గంటల సడలింపు ప్రారంభమయింది కాబట్టి బ్రతుకుజీవుడా అని రోడ్లమీద పడ సాగేరు జనం.

కర్ఫ్యూ విధించి నాలుగురోజులే అయినా ఒకర్నొకరు చూసు కుని ఎంతో కాలమయిందన్న భావన. మిత్రుల్ని, బంధువుల్ని కలుసుకోవాలన్న ఆరాటం. మూడు రోజుల తర్వాత ప్రకటించిన సడలింపు ప్రజానీకానికి బోలెడంత పూరడింపు.

రోడ్డునపడ్డ జనానికి రోజూ చూసే రోడ్లే కొత్తగా, వింతగా కన్పించసాగేయ్. మనుషుల్ని చూస్తుంటే అదోరకం ఆత్మీయతా భావం, దగ్గరితనం కలుగుతున్నది. ముఖ పరిచయం వుంటే చాలు ముసి ముసి నవ్వుల్తోనైనా పలుకరించుకుంటున్నారు.

ఆఫీసులకు వెళ్ళడమంటే శిక్షగా భావించే వారికూడా ఆఫీ సులపై మమకారం పుట్టసాగింది. స్కూళ్ళకి వెళ్ళాలని ఉబలాట పడుతున్నారు పిల్లలు

కిళ్ళీకొట్టు దగ్గర పేపర్‌కోసం ఎగబడుతున్నారు జనం.

"నేకూడా ట్రైచేస్తానుండండి" అంటూ గుంపులోకి జొర బడ్డాడు చిదంబరం.

అక్కడ జనం తొక్కిసలాటను తిలకిస్తూ నించున్నాడు భగ వంతరావు.

పది నిమిషాల్లో పేపర్ చేతపట్టుకుని విజయగర్వంతో తిరిగి వచ్చాడు చిదంబరం.

పేపర్లోని హెడ్‌లైన్లన్నీ ఆత్రంగా చదవసాగేరు. అయిదు నిమిషాలు అలా అలా పేపరు చూసి వాచీ వంక చూశాడు భగ

వంతరావు.

అలా రోడ్లమీద వుండేందుకు మరో గంట మాత్రమే టైముంది.

"అవునూ పేపరు మామూలు రేటేనా .... ఏమైనా ఎక్కువ తీసుకున్నాడా" అడిగాడు భగవంతరావు.

"మామూలు రేటా .... పరేలే, మీరెంత అమాయకులండీ బావగారూ. అసలు ధర రెండ్రూపాయలయితే నాలుగు రూపాయలు తీసుకున్నాడు" చెప్పేడు చిదంబరం.

"రెట్టింపు ధరా!"

"పరేలే .... అయిదు రూపాయలన్నా మారు మాట్లాడకుండా కొంటారు జనం. చూశారుగా ఇందాక కొట్టుదగ్గర కొట్లాట"

"మరీ ఇంత దారుణమా ?"

"అవునూ ఓ రెండు టీ లాగించేద్దామా" అడుగుతూనే అటుగా నడిచాడు చిదంబరం. అనుసరించేడు భగవంతరావు.

జేబులోనుంచి డబ్బు తీయబోతున్న చిదంబరాన్ని వారించి "నేనిస్తా వుండు" అంటూ రెండ్రూపాయల కాయితం బయటకు తీసి చేయి ముందుకు చాచేడు.

"రెండు టీ" అన్నాడు.

"నాల్రూపాయలు, నాల్రూపాలీండి" రెండు గ్లాసుల్లోకి టీ పోస్తూ అన్నాడు టీ స్టాల్ కుర్రాడు.

"ఒక్కటీ రెండు రూపాయలా'' ఆశ్చర్యంగా అడిగేడు భగవంతరావు.

డబ్బులందించడం, టీ గ్లాసులు రెండూ తన చేతుల్లోకి తీసుకోవడం చిదంబరానికి తప్పలేదు.

"అవన్నీ అడక్కూడదు బావగారూ... అదంతే" అంటూ టీ

తాగసాగేడు చిదంబరం.

"ఇది అన్యాయమయ్యా, ఎంత కర్ఫ్యూ అయితే మాత్రం.... ఈ రెండుగంటల వ్యవధిలో ఇంతగా దోచుకోవాలా."

ఖాళీ గ్లాసు స్టూలుపైన పెట్టి సిగరెట్ పాకెట్ కొనేందుకు పక్కనే వున్న కిళ్లీ కొట్టుకు వెళ్లాడు చిదంబరం.

"టైమయిపోతుంది త్వరగా రా" హెచ్చరింపుగా అన్నాడు భగవంతరావు

టీ స్టాల్ కుర్రవాడు పాత్రలు కడగనారంభించేడు. కిళ్ళీకొట్టు తను కొట్టు తలుపుకు తాడుకట్టి వేలాడదీసిన వారపత్రికలు, సినిమా పత్రికలు తీసి లోపలపెట్టుకోసాగేడు.

"సిగరెట్లన్నా మామూలు రేటుకు కొన్నావా....లేకపోతే అవి కూడా "

"అపండాపండి బావగారూ. పేపర్లు, టీలు రెట్టింపు ధరల కమ్ముతుంటే సిగరెట్లు అసలు ధరలకు అమ్మే అమాయకులెవరండీ" బావగారి ప్రశ్న పూర్తి కాకుండానే సమాధానం చెప్పేడు చిదంబరం.

"అంటే ఇవికూడా డబుల్ రేట్ పెట్టి కొన్నావా ?"

"ఆహా....తప్పదు. అయినా అంతగా ఆశ్చర్యపోతారెందుకు బావగారూ ఇవన్నీ చాలా మామూలు విషయాలే ఇంగ్లీషులో 'ఎక్స్‌ప్లాయిటేషన్' అనేమాట ఒకటుంది కదా. అది ఇదే కదా."

మౌనంగా నడవసాగేడు భగవంతరావు

రెట్టింపు ధరకు కొనుక్కున్న సిగరెట్‌ను వెలిగించుకున్నాడు చిదంబరం.

"ఎక్కడ చూసినా దోపిడీ... దోపిడీ. రిక్షావాలా దగ్గర్నుంచీ లక్షాధికారి దాకా ఎవరిస్థాయిలో వారు దోచుకుంటూనే వున్నారు.

వాన పడుతున్నప్పుడు రెండు రూపాయలు అదనంగా అడిగినా రిక్షా బాడుగ ఇచ్చేందుకు ఇబ్బంది వుండదు. కాని అర్జంటుగా హాస్పిటల్‌కు వెళ్లేటప్పుడు, సినిమా టైం అయిపోతుండగా థియేటర్‌కు వెళ్లేటప్పుడు రిక్షావాళ్లు ఎలా అడుగుతారో కదూ." చెప్పసాగేడు భగవంతరావు.

సిగరెట్ తాగుతూ తాదాత్మ్యత పొందుతున్న చిదంబరం మాట్లాడకుండా భగవంతరావు మాటల్ని ఆలకించసాగేడు మధ్య మధ్యలో తల మాత్రం వూగిస్తున్నాడు.

మాటల్లోనే ఇంటివాకా వచ్చేశారిద్దరు.

"అరటిపళ్లు అరటిపళ్లు" బండి నెట్టుకుంటూ ఇంటిదారి పట్టిన రాజయ్య అరుస్తున్నాడు ఆ పూటకు ఆఖరి బేరం తగుల్తుందేమోనన్న ఆశతో.

"ఎలా ఇస్తున్నావో అరటిపళ్ళు ?" అడిగేడు చిదంబరం.

"డజను ఆర్రూపాయలండీ"

"ఆరా" ఆశ్చర్యం ప్రకటించిన భగవంతరావు బలవంతంగా చేయి పుచ్చుకుని వెనక్కి లాగేడు చిదంబరాన్ని.

"బండికి దగ్గరగా జరిగి ఇచ్చేమాట చెప్పు రెండు డజన్లు తీసుకుంటాను" అడిగేడు భగవంతరావు.

"అయిదు వేసుకుని తీసుకోండి సార్."

"ఆర్రూపాయలకు రెండు డజన్లు అయితే వద్దన్నాం. డజను రెండ్రూపాయలకిస్తే తీసుకుంటా"

"అంత తేడా వుండదు సార్ అయినా ఇంటికెళ్తున్నామని అయిదు కాడికిటమేగానీ మిగిలేదేం ఉండదయ్యా" వినయంగా అన్నాడు రాజయ్య.

"నీ ఇష్టం."

"ఇంటికాడ్నించి బయల్దేరేటప్పుడు చుట్టుపక్కల పిల్లకాయలు చుట్టుముట్టి కొయిలిమ్మని చేతులు సాచినా ఈకుండా వచ్చేను. మీకు పగానికి సగం రేటుకు అమ్ముకునేకంటే అల్లకిత్తే అకలి దీర్చిన తృప్తన్నా వుంటది." అనుకుంటూ ముందుకు సాగేడు రాజయ్య.

"మరీ అన్యాయంగా అడిగేరు బావగారూ. అతను చెప్పింది కరెక్టు రేటే" అనునయంగా అన్నాడు చిదంబరం.

"నేనేం తెలివి తక్కువగా అడగలేదు. ఆ అరటిపళ్ల చూశావా పండిపోయి ఉన్నయ్. మళ్ళీ రేపు సాయంత్రానిక్కదా అతను అమ్ముకునేది. అందాకా అవి వుంటయ్యని నాకు నమ్మకం లేదు. మిగల పండి నుజ్జు నుజ్జవుతయ్. అందుకే ఎంతకడిగినా ఇస్తాడ్లెమ్మని అడిగే" అని నవ్వేడు గర్వంగా భగవంతరావు.

బావగారివైపు విస్మయంగా చూడటం మినహా ఏమీ అనలేక పోయాడు చిదంబరం.

"అయితే ఒక్క విషయం గ్రహించాలి నీలాటి వాళ్ళంతా." అంటూ బావమరిదివైపు చూశాడు తను.

ఏమిటన్నట్టు చూశాడు చిదంబరం.

"అతనికున్న పట్టుదల ఆత్మ నిగ్రహం మనకుంటే ఇలాంటప్పుడు రెట్టింపు ధరలకు పేపర్లూ కొనం, మూడు రెట్లకు సిగరెట్ పేకెట్లూ కొనం, క్యూల్లో నిల్చుని బండ్లదగ్గర పెసరట్లూ తినం."

అరటిపండ్లను అలా బేరం చేయకుండా వుంటే అతగాడి మాటలు నచ్చేవేగానీ ఆ మాటలు అతను చెప్పటంవల్ల కాబోలు రుచించలేదు చిదంబరానికి.

ఏమైనా బావగారి మాటలు ఆలోచనల్లో పడేసినయ్ అతన్ని.

— )o( —